


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

APRIL-2005

# సంక్షిప్తవార్తలు

2005 ఫిబ్రవరి 19వ తేదీ నాడు రాజమండ్రి స్పిన్నింగ్ మిల్ కోలనీ-2లో యున్న క్రీస్తు సంఘము తమ 4వ వార్షికోత్సవమును కృతజ్ఞతా పూర్వకభావముతో ఘనముగా నిర్వహించిరి. ఆ రోజు ఏర్పాటు చేయబడిన కూటములో అనేకులు స్థానికులు పాల్గొనిరి. సోదరులు సమర్పణ సామ్యూల్, ఎస్.జె.బెన్‌హర్, జాషువా గూటం గార్లువాక్య పరిచర్య చేసిరి. ఆ కూటమునకు హాజరైన వారందరికీ స్థానిక సంఘము మంచి విందు నేర్పాటు చేసిరి. స్పిన్నింగ్ మిల్ కోలనీలో సోదరులు వై.సురేష్‌బాబు గారు క్రీస్తుకొరకు నిర్విరామ కృషి చేయుచున్నారు.

మార్చి 4వ తేదీ శుక్రవారం ప్రత్తిపాడు మండలం వొమ్మంగిలో వున్న ఒక ఇండిపెండెంట్ సంఘకూటములో జాషువాగారు వాక్యపరి చర్య చేసిరి. ఆ కూటమునకు అనేకులు హాజరై క్రీస్తు సంఘమునందు, క్రొత్తనిబంధన సత్యమునందు ఆసక్తి కనుబరచిరి. సత్యవాక్యమునకు విధేయులగుటకు తమ సంసిద్ధతను వ్యక్తపరచిరి. వొమ్మంగిలో వల్లూరు రత్నంగారు సువార్తచాటు చున్నారు.

మార్చి 12వ తేదీ శనివారం పిఠాపురం, అగ్రహారంలో నిర్మించ బడిన క్రీస్తు సంఘము ఆలయమును జాషువా గూటం దంపతులు దేవుని సేవ కొరకు ప్రతిష్ట చేసిరి. ఆ సంతోష కార్యక్రమమునకు స్థానిక సంఘస్థులు, సువార్తికులు, శ్రేయోభిలాషులు హాజరైరి. జాషువా గారు వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము మంచి విందు నేర్పాటు చేసిరి. పిఠాపురం అగ్రహారంలో సోదరులు డి.యేసు రత్నం గారు సువార్త చాటుచున్నారు.

మార్చి 14వ తేదీ సోమవారం ధవళేశ్వరం మంగళవారపేటలో యున్న క్రీస్తు సంఘము ఏర్పాటు చేసిన సువార్త కూటములో సోదరులు జాషువా గారు వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము చాల ఉత్సాహముగా ఆ కార్యక్రమములో పాల్గొనిరి. సోదరులు

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 ఏప్రియల్ 2005 సంచిక 9


## నీవు బాప్తిస్మమును పొందుటకు కొన్ని ముఖ్యకారణములు

(Some Important Reasons Why you Need to be Baptised)

బాప్తిస్మమును గూర్చి గతకొద్ది సంచికలలో విపులముగా తెలిసి కొంటిమి. మీలో ఎవరయినను పసి బిడ్డలుగా నున్నప్పుడు చిలకరింపును పొందిన యెడల వాక్యప్రకారము మీరు బాప్తిస్మ మును పొందలేదు అని గమనించుడి. పెరిగి పెద్దవారయిన తరువాత కూడ చిలకరింపుగాని, కుమ్మరింపుగాని పొందిన యెడల అదికూడ వాక్యప్రకారమైన బాప్తిస్మము కాదు. మీలో ఎవరయినను యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, భక్తిగల జీవితాన్ని జీవించుచు ఇంకను బాప్తిస్మ మును పొందకుండా యుండిన యెడల మీరింకను రక్షింపబడలేదు అని గుర్తించ వలెను. యేసునందు విశ్వాసముంచినంత మాత్రాన సరిపోదు, మీ విశ్వాసమును విధేయత చూపించుట ద్వారా నిరూపించు కొనుడి. "ఇదిగో ఇప్పుడే మిక్కిలి

అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" అని బైబిలు బోధించు చున్నది (2 కొరింథి 6:2). యేసునందు విశ్వాసులైన మీరు బాప్తిస్మమును ఎందుకు పొందవలెనో ఈరోజు దైవవేదము నుండి మీకు తెలియ పరచవలెనని కోరుచున్నాను. నేను చెప్పు ప్రతి కారణమునకు ఒక బైబిలు రిఫరెన్సును ఇచ్చెదను గనుక దయచేసి వాటిని నోట్ చేసికొనండి.

బాప్తిస్మము అను ఈ క్రియ విషయమై నేటి క్రైస్తవ లోకములో ఎన్నో అపోహలు ఉన్నవి. మనము బైబిలును మాత్రమే సంప్రదించిన యెడల అవన్నియు మటుమాయమగుటయే గాక, బాప్తిస్మము యొక్క ప్రయోజనమును, ప్రాముఖ్యతను ఇట్టే గమనించగలము. బాప్తిస్మమును ఎందుకు పొందవలెను?

1. అది దేవుని ఆజ్ఞ గనుక నీవు బాప్తిస్మమును పొందవలెను. మత్తయి 28:19లో యేసు తన శిష్యులను ఇట్లు ఆజ్ఞాపించెను: "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి".

మార్కు 16:16లో "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని యేసు ఆజ్ఞాపించెను. అపొ.కా. 10:48లో, కొర్నేలియను ఒక భక్తిపరుని యింటిలో సువార్తను బోధించి, యేసు క్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని పేతురు వారిని ఆజ్ఞాపించెను. గనుక మిత్రులారా, బాప్తిస్మము దేవుడిచ్చిన ఒక ఆజ్ఞ. దానికి లోబడుట ద్వారానే మీకు రక్షణ లభించ గలదు.

2. దేవుని చిత్తమును నీవు నిరాకరించ కుండుటకు నీవు బాప్తిస్మము పొందవలెను. "ప్రజలందరును, సుంకరులును (యోహాను బోధ) విని, అతడిచ్చిన బాప్తిస్మము పొందిన వారై దేవుడు న్యాయవంతుడని యొప్పు కొనిరి గాని పరిసయ్యులును, ధర్మశాస్త్రోపదేశకులును అతనిచేత బాప్తిస్మము పొందక, తమ విషయమైన దేవుని సంకల్పమును నిరాకరించిరి" యని లూకా 7:29, 30 చెప్పుచున్నది. నీవును నీ యెడల దేవుని సంకల్పమును నిరాకరించకుండా యుండవలెనంటే క్రీస్తు నామమున బాప్తిస్మమును పొందవలెను.

3. దేవుని రాజ్యములో ప్రవేశించవలె

వని నీవు కోరుచున్న యెడల, నీవు బాప్తిస్మము పొందవలెను. "ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని యేసు పలుకుచున్నారు (యోహాను 3:5). "వీరు బాప్తిస్మము పొందకుండా ఎవడైనను నీళ్ళకు ఆటంకము చేయగలడా?" యని అపొ.కా. 10:47లో పేతురు ప్రశ్నించుచున్నాడు. దేవుని రాజ్యములో ప్రవేశింపగోరిన యెడల నీవు నీటిలో ముంచడం పొందుట అత్యవసరం.

4. నీవు రక్షించబడి, దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి కలిగియుండు నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. 1 పేతురు 3:21 ఏమి చెప్పుచున్నదో ఇప్పుడు చూద్దాం : "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే". చూచారా, వాక్యము ఏమి చెప్పుచున్నదో? బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది. బాప్తిస్మము పొందకుండ ఎవరైనా రక్షించబడ్డా రను కుంటే అంతకుమించిన అబద్ధం మరొకటి లేదు.

5. దేవునియందు సంతోషించుచు జీవితాన్ని గడపాలనుకుంటే నీవు బాప్తిస్మము పొందుట అవుసరం. అపొ.కా. 8:38-39లో చూచిన, "ఫిలిప్పు, నపుంసకుడు నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను" అని యున్నది. (చిలకరింపే బాప్తిస్మమయితే ఫిలిప్పు, నపుంసకుడు నీళ్ళలోనికి దిగవలసిన అవుసరమే మున్నది?). ముంచడము పొందిన తరువాత నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను అని వ్రాయబడి యున్నది.

6. నీవు క్రీస్తులోనికి ప్రవేశించవలెనన్న బాప్తిస్మము అవుసరము. గలతీ 3:27ను చూద్దాం.: "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని వ్రాయబడి యున్నది. క్రీస్తును నీవు ధరించుకొనిననాడే నీవు క్రైస్త వుడవు కాగలవు. బాప్తిస్మము పొందిననాడే నీవు క్రీస్తును ధరించు కొనగలవు. క్రీస్తును ధరించుకొనకుండా క్రీస్తు లోనికి నీవు రావడం అసాధ్యము.

7. యేసుక్రీస్తు తవ మరణములో చిందించిన రక్తమును నీవు తాకగల్గునట్లు బాప్తిస్మము పొందవలెను. "క్రీస్తు

యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" యని రోమా 6:3 ప్రశ్నించుచున్నది.

**8. యేసుక్రీస్తు యొక్క సమాధి, పున రుత్థానముల యందు ఐక్యత కలిగి యుండుటకు నీవు బాప్తిస్మము పొందవలెను.** కొలస్స 2:12 ఇట్లు చెప్పుచున్నది: "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావ మందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి".

**9. నీవు నూతన జీవము కలిగి నడుచుకొనవలెనంటే బాప్తిస్మము అవుసరము:** "మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన..............ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" యని రోమా 6:4 చెప్పుచున్నది.

**10. నీ పాపములను కడుగుకొనవలెనంటే నీవు బాప్తిస్మము పొందవలెను.** అపొ.కా. 22:16 ఇట్లు చెప్పుచున్నది: "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి, ప్రార్ధన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము". యేసుక్రీస్తు నందు విశ్వాసియైన నీవు ఇంకనూ బాప్తిస్మము పొందలేదంటే నీవింకనూ నీ పాపములతోనే యున్నా వని అర్ధము. అంటే నీవేమనుకున్నా సరేగాని, నీవు రక్షించబడలేదు.

**11. పరిశుద్ధాత్మ అను వరమును నీవు పొందవలెనంటే నీవు బాప్తిస్మము పొందవలెను.** అపొ.కా. 2:38 ఇట్లు చెప్పుచున్నది: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి: అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు".

బాప్తిస్మమను ఈ ఆజ్ఞకు లోబడుట ఎంత ఉత్తమమో మీరు ఈపాటికి గమనించేయుంటారు. రక్షణ పొందుటకు బాప్తిస్మము అవుసరం లేదు అని మీరనుకొనవద్దు. అట్లు బోధించువారి మాటలను నమ్మవద్దు. ఎందుకంటే రక్షణ మార్గములో క్రీస్తు బాప్తిస్మము నుంచారు. దానికి మనము లోబడవలసినదే. దానికి లోబడడానికి మీకు ఇష్టములేని యెడల దేవుని ప్రతిదండనను మీరు ఎదుర్కొన వలసి వచ్చును (2 థెస్స 1:8).

యేసుతో కూడ సిలువ వేయబడిన ఇద్దరి దొంగలలో ఒకడు బాప్తిస్మము పొంద కుండగనే రక్షించబడెను గదా, వాని సంగతి యేమి? అని కొందరు అడుగవచ్చును. ఆ దొంగ మోషే ధర్మశాస్త్ర ప్రకారము జీవించెను. క్రీస్తు కూడ అట్లు జీవించెను. ఆ చట్టము క్రింద అనేకుల పాపములను క్రీస్తు క్షమించెను. "పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్య కుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెనని" యేసు మత్తయి 9:6లో చెప్పెను. (మార్కు 2:10, లూకా 5:24). యేసుక్రీస్తు మరణించకముందు ఆ దొంగ ప్రభువును వేడుకొనెను. గనుక ప్రభువు అతని పాపములను క్షమించెను. క్రీస్తు చనిపోవకముందు నీ పాపముల క్షమించబడి యున్నవని చెప్పు అధికారము ఆయన కుండెను. అయితే ఆయన చనిపోయిన తరువాత ఆయన శాసనము అమలులోనికి వచ్చెను. ఆయన చనిపోకముందు సిలువపై నున్న దొంగతో "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని" చెప్పెను (లూకా 23:43). ఆయన చనిపోయి తిరిగి లేచిన తరువాత, తన అపొస్తలులతో "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును" అని చెప్పెను.

ఈ ఆజ్ఞను యేసు ఎప్పుడు ఇచ్చెను? ఆయన మరణమునకు ముందా? వెనుకా? ఆయన మరణించిన తరువాతనే గదా! ప్రభువు వారిని ఏమని ఆజ్ఞాపించెనో దానినే అపొస్తలులు బోధించిరి. రక్షణ మార్గమును బోధించుటలో ఒక్కసారి కూడ వారు సిలువ పైనున్న దొంగను మాదిరిగా చూపించలేదు. "అపొస్తలుల కార్యములు" అను పుస్తక మంతటిలోను ప్రభువు వారికి చెప్పిన దానినే వారు ప్రజలకు బోధించిరి. వారిద్వారా సువార్తను వినిన ప్రజలు యేసునందు విశ్వాసముంచిరి, తమ పాపముల విషమై మారు మనస్సు పొందిరి, యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని, వారి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. నాటినుండి నేటివరకు రక్షణ పొందగోరు ప్రతివాడును యేసు ఇచ్చిన ఈ ఆజ్ఞలకు లోబడవలసినదే. దేవుడు పక్షపాతి కాడు గనుక రక్షణ పొందుటకు నీకొక ఆజ్ఞ, నాకొక ఆజ్ఞ, వేరొకనికి ఇంకొక ఆజ్ఞను ఇయ్యడు. గనుక మిత్రులారా, మీ సంగతి యేమి? మీ పాపములను యేసురక్తములో కడుగుకొనగోరిన యెడల మీకు దగ్గరగా యున్న క్రీస్తు సంఘాన్ని దర్శించండి. వారు తప్పక తక్షణమే మీకు బాప్తిస్మము ఇయ్యగలరు. లేదా వెంటనే మాకు వ్రాయండి. మీ ఆత్మరక్షణ విషయంలో అశ్రద్ధ చేయవద్దు సుమా!

# దేవదూతలు

(The Angels of God)

బైబిలును చదువుచున్న ప్రతివాడు దేవదూతలను గూర్చి దానిలో ఎక్కడో ఒకచోట చదువుట తటస్థించును. దేవ దూతలను గూర్చి మానవులలో రకరకాల అభిప్రాయములు లేకపోలేదు. దేవదూతలు పాతనిబంధన కాలమునకు చెందిన వారే గనుక వారిని గూర్చి మనము తెలిసికో నక్కరలేదని కొందరు అనుకొను చుందురు. అయితే దూతలను గూర్చి పాత నిబంధనలో ఇంచుమించు 180 సార్లు, క్రొత్త నిబంధనలో 186 సార్లు చెప్పబడి యున్నది. దూవదూతలంటూ లేరని వాదించే ఆధునిక సద్దూకయ్యులు కూడ కొందరు లేకపోలేదు. యేసుక్రీస్తు కాలమందు యూదులలో యున్న "సద్దూకయ్యులు పునరుత్థానము లేదనియు, దేవదూతయైనను ఆత్మయైనను లేదనియు చెప్పుదురు, గాని పరిసయ్యులు రెండును కలవని ఒప్పుకొందురు" అని మన మెరుగుదుము (అపొ.కా. 23:8). దేవదూతలు యదార్థముగా ఉన్నారని, దేవదూతలు నిజమేనని బైబిలు బోధించుచున్నది.

దేవదూత, లేక దూతయను పదము 'Angelos' అను గ్రీకు పదము నుండి ఉద్భవించినది. దూత యనగా వార్తావాహుడు అని యర్థము. ఒక్కోసారి మానవులకు కూడ ఈ పదము వర్తించును. వారు ఏదైనా వర్తమానము నందించునపుడు వారు దూతలని చెప్పుట కూడా కలదు (హగ్గయి 1:13, మలాకీ 2:7). దూతలు దైవపుత్రులని. పరిశుద్ధ దూతలని, పరలోక సైన్య సమూహమని బైబిలులో చెప్పబడినది (కీర్తన 29:1; 89:5,6; లూకా 2:13). దేవదూతలు సెరాపులనియు, కెరూబులనియు, జీవులనియు పెద్దలనియు బైబిలు నందు పిలువబడిరి.

### సృష్టింపబడినవారు

దేవదూతలు ఎట్లు కలిగిరి? అనే ప్రశ్న మనకు రావచ్చును. దేవదూతలు దేవునిచే సృష్టింపబడిన వారని బైబిలు చెప్పుచున్నది. "ఆయన దూతలారా మీరందరు ఆయనను స్తుతించుడి. ఆయన సైన్యము లారా మీరందరు ఆయనను స్తుతించుడి" యని కీర్తన 148:2లో వ్రాయబడి యున్నది. 5వ వచనములో "యెహోవా ఆజ్ఞ ఇయ్యగా అవి పుట్టెను. అవి యెహోవా నామమును స్తుతిం

చును గాక" అని వ్రాయబడి యున్నది. అపో.పౌలు యేసును గూర్చి చెబుతూ కొలస్స 1:16లో "ఆకాశమందున్నవియు, భూమియందున్న వియు దృశ్యమైనవిగాని అదృశ్యమైనవి గాని అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికార ములైనను సర్వమును ఆయనయందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింప బడెను" అని వ్రాసెను. "నీవే అద్వితీయు డవైన యెహోవా,నీవే ఆకాశమును మహాకాశ ములను వాటి సైన్యమును, అంతటిని సృజించి వాటినన్నిటిని కాపాడువాడవు. ఆకాశ సైన్యమంతయు నీకే నమస్కారము చేయుచున్నది" యని నెహెమ్యా 9:6లో వ్రాయబడి యున్నది.

దేవదూతలు ఎప్పుడు సృజింపబడిరో మనకు వివరముగా తెలియదు. "ఆది యందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని వ్రాయబడి యున్నది. దేవుడు భూమ్యాకాశములను సృజించి నప్పుడు ఎప్పుడో దేవదూతలు కూడ సృజింపబడిరి. దూతలు సృజింపబడిన వారు గనుక వారికొక ఆది అంటూ యున్నది. దూతలు ఎన్నడు మరణించక పోయినను అవి దేవుని వలె నిత్యత్వమును కలిగినవి కావు.

దేవుని సృష్టిలో దూతల స్థానము ఎక్కడ ఉన్నది? యని మనమడిగిన యెడల దూతలు యేసుకంటే తక్కువైన వారు. మానవాకారమెత్తిన యేసును గూర్చి పౌలు చెబుతు ఆయన "దేవదూతలకంటె ఎంత శ్రేష్టమైన నామము పొందెనో వారికంటే అంత శ్రేష్టుడై ఉన్నత లోకమందు మహా మహుడగు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండెను" అని హెబ్రీ 1:4లో వ్రాసెను. "మరియు ఆయన భూలోకమునకు ఆది సంభూతుని మరల రప్పించినప్పుడు దేవ దూతలందరు ఆయనకు నమస్కారము చేయవలెనని చెప్పుచున్నాడు అని హెబ్రీ 1:6లో వ్రాస్తూ దూతలకంటే యేసు క్రీస్తు శ్రేష్టుడని అపో.పౌలు మనకు తెలియ జేయు చున్నాడు. దూతలు యేసుకంటె తక్కువ వారయినను వారు మానవునికంటె శ్రేష్టులని మనము గమనించవలెను. మానవుని దేవుడు దూతలకంటె కొంచెము తక్కువ వానిగా చేసినట్లు హెబ్రీ 2:7; కీర్తన 8:5లను బట్టి మనము గ్రహించుకొనగలము.

### ఆరాధనీయులు కాదు

దూతలు మానవునికంటె శ్రేష్టులైనను మనము వారిని ఆరాధించకూడదు. "దేవ దూతారాధనయందు ఇచ్ఛ కలిగిన వాడె

వడును మీ బహుమానమును అపహరింప నియ్యకుడి" అని కొలస్స 2:18లో పౌలు చెప్పుచున్నాడు. యేసుక్రీస్తు యొక్క వర్తమానమును యోహానుకు బయలుపరచిన దేవదూతను అతడు ఆరాధించుటకు ప్రయత్నించగా అదూత అభ్యంతరము చెప్పెను. సరిగదా, నేను మీతో సహదాసుడను దేవునికే నమస్కారము లేక ఆరాధన చేయుమని చెప్పెను (ప్రకటన 19:10; 22:8,9).

మానవునికంటె దూతలు శ్రేష్టులే అయినను మానవులు దూతలకు తీర్పు తీర్చుదురని పౌలు 1 కొరింథీ 6:3లో చెప్పెను. మానవులు దూతలకు తీర్పు ఎట్లు తీర్చుదురు? దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక పాతాళ లోకమందలి కటిక చీకటిగల బిలములలోనికి త్రోసి తీర్పుకు కావలిలో ఉంచుటకు వారిని అప్పగించెను" అని 2 పేతురు 2:4లో వ్రాయబడి యున్నది. మహిమా ప్రభావములు గల దేవుని సన్నిధిలో నేరుగా యున్నను దూతలు పాపము చేసిరి. కాని క్రైస్తవులలో అనేకులు మరణ పర్యంతము దేవునికి నమ్మకముగా యుండి నిత్య జీవములో ప్రవేశింతురు (ప్రకటన 2:10). ఇంకొక మాటలో క్రైస్తవులు తమ పరిశుద్ధ జీవితమును బట్టి పాపములో పడిన దూతలను ఖండింతురు లేదా వారికి తీర్పు తీర్చుదురు. మనము తీర్పు తీర్పు దూతలు నిత్యాగ్ని లోనికి పడవేయబడుదురు (మత్తయి 25:41).

## అసంఖ్యాకులు

దేవదూతల సంఖ్య ఎంత ఉన్నదో మనకు తెలియదు. వారు అసంఖ్యాకులని మనము గ్రహించవచ్చును. యేసును పట్టు కొనుటకు వచ్చినవారినుండి విడుదల పొందుటకు అవుసరమయితే పండ్రెండు సేనా వ్యూహములకంటె ఎక్కువ మంది దేవదూతలను తండ్రియైన దేవుడు పంప గలడని ఆయన చెప్పెను (మత్తయి 26:53). పండ్రెండు సేనా వ్యూహములు అంటే 72,000 మంది అని అర్థము. వేల కొలది యున్న దూతలను గూర్చి హెబ్రీ 12:22లో పౌలు చెప్పెను. పరలోకమందున్న దూతల లెక్క కోట్లకొలది ఉండెనని ప్రకటన 5:11లో వ్రాయబడి యున్నది.

దేవదూతలు వివాహము చేసికొనరు అని మనము గమనించవలెను. "పునరుత్థాన మందు ఎవరును పెండ్లి చేసికొనరు; పెండ్లి కియ్యబడరు. వారు పరలోక మందున్న దూతలవలె ఉందురు" అని మత్తయి 22:30లో యేసు బోధించెను. దేవదూతలు

చావనేరరు అని లూకా 20:36లో వ్రాయ బడి యున్నది. దేవదూతలు దేవుని సేవకు లైన ఆత్మలు. వారు రక్షణ యను స్వాస్థ్యము పొందబోవు వారికి పరిచారము చేయుటకై పంపబడిన సేవకులైన ఆత్మలు (హెబ్రీ 1:14). దేవదూతలు ఆత్మలే అయినను వారికి శరీరము కలదు. అది భూసంబంధమైన శరీరము, రూపము కాదు (1 కొరింథీ 15:40).

## దేవుని సేవకులు

దూతలు సాధారణముగా మానవా కారము కలిగి కనబడినట్లు బైబిలులో మనము చూడగలము. అవి జంతురూ పములో గాని వస్తురూపములో గాని ఎన్నడు కనబడలేదు. అగ్నిలో నుండి మేఘములో నుండి ప్రభువుదూత పలికినను, ఒక గాడిదచే మాట్లాడించినను దూతయే అగ్నిగాను, మేఘముగాను, గాడిదగాను ఎన్నడు అగపడలేదు. అప్పుడప్పుడు దూతలు మహిమగల మనుష్యులవలె అగుపడిరి. యేసు సమాధి దగ్గరకు వెళ్ళిన స్త్రీలు ప్రకాశమానమైన వస్త్రములు ధరించిన యిద్దరు మనుష్యులను చూచిరి. (లూకా 24:4). దూతలు పురుషుల ఆకార ములో కనబడినట్టు మనము చూడగలము (ఆది 18:2; 19:1). వారిలో ఇద్దరుకు గబ్రియేలు మిఖాయేలు అను పేరులు కలవు (లూకా 1:19; యూదా:9).

దూతలు సర్వశక్తిమంతులుకారు. వారు దేవునిసేవకులే. దూతలు క్రీస్తు అధికారమునకు లోబడుచున్న వారని పేతురు వ్రాసెను (1 పేతురు 3:22). ఇహపరములయందు సర్వాధికారము క్రీస్తుకే యున్నది (మత్తయి 28:18). దూతలకు సమస్తము తెలియదు. క్రీస్తు రెండవ రాకడ సమయము పరలోక మందలి దూతలకైనను తెలియదు (మత్తయి 24:36). దూతలు సర్వాంతర్యాములుకాదు. అయినను వారు మనుష్యుల యెదుట అకస్మాత్తుగ కనబడవచ్చును (లూకా 1:11:2:9). మానవులు వెళ్ళలేని చోట్లకు వారు వెళ్ళగలరు. ఆత్మలుగనుక వారు మానవులవలె ప్రయాణించ నవుసరము లేదు. దేవదూతలు దేవుని వాక్యమునకు లోబడియుండవలెను. వారు వేరొక సువార్తను మనకు ప్రకటించగూడదు. అట్లు చేసిన యెడల వారు కూడ శాపగ్రస్తులవు దురు (గలతీ 1:8, 9).

దూతలు ఓర్పుగలవారు (సంఖ్యా 22:22-35). వినయ విధేయతలుగలవారు (2 పేతురు 2:11). పరిశుద్ధులు (మార్కు 8:38); మనకు తెలియకుండ కనబడువారు

(హెబ్రీ 13:2). అయినను దూతలు స్వేచ్ఛను కలిగియుండని వారు కారు. మేలు కీడులను ఎంచుకొనే శక్తిని దేవుడు వారికి ఇచ్చియున్నాడు. అందువలన మానవుల వలె దూతలుకూడ పాపములో పడగలరు. అలనాడెప్పుడో కొందరు దూతలు పాపము చేయగా దేవుడు వారిని పాతాళ లోకము లోనికి త్రోసి కటిక చీకటిగల బిలములలో వారిని తీర్పుకొరకు కావలిలో ఉంచి యున్నాడు (2 పేతురు 2:4). మానవులవలె గాక పాపముచేసి దూతలకు రక్షణమార్గము ఏదియునులేదు. పాపము చేసిన దూతలు తమ నాయకుడైన సాతానుతో సహా తీర్పు దినమందు నిత్యాగ్ని లోనికి పడవేయబడు దురు (మత్తయి 25:41). పాపమంటూ లేనప్పుడు వారిని శోధించు వాడెవడు లేనప్పుడు దూతలు పాపము చేసి నందున బహుశ వారికి రక్షణ సంకల్పమేమియును దేవుడు కల్పించలేదు.

దేవదూతలు ఎప్పుడు పాపము చేసిరో మనమెరుగము. అయితే మానవునికంటె ముందువారు పతనమైనట్లు గ్రహించు కొనవచ్చును. ఎందుకంటే హవ్వ పాపము చేయునట్లు ఆమెను శోధించుటకు అపవాది సర్పరూపమున ఆమెకు కనబడెను. అయితే మానవులు పాపములో పడక ఎంతకాలము ముందు దూతలు పాపము చేసినారో మనకు తెలియదు. అయితే దూతలు ఎందుకు పాపము చేసిరి? ఇదికూడ ఒక గొప్ప మర్మమే.

దేవుడు మానవులవలెనే దూతలను కూడ స్వేచ్ఛ కలిగి ఎంపికచేసికొనే శక్తిగల వారినిగా సృజించెను. యెవరును బలత్కా రముతో దేవునికి లోబడవలెనని ఆయన కోరుట లేదు. గాని మనస్ఫూర్తి యిష్టమును బట్టి నిర్ణయమును బట్టి, హృదయ పూర్వకముగా ఆయనకు లోబడవలెనని కోరుచున్నాడు. అందువలన కొంతమంది దేవదూతలు దేవునికి వ్యతిరేకముగా తిరుగు బాటు చేసి ఆయనకు అవిధేయులై పాపము చేసినట్లు మనము గ్రహించుకొనగలము. అపవాది గర్వాంధుడై తిరుగుబాటు చేసెను (1 తిమో 3:6). అపవాది యొక్క పతనాన్ని బహుశ యెషయా యిట్లు వర్ణించుచున్నాడు: "తేజో నక్షత్రమా వేకువచుక్కా నీవెట్లు ఆకాశము నుండి పడితివి?...............నేను ఆకాశమున కెక్కి పోయెదను. దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును............మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీ మనస్సులో అనుకొంటివిగదా? నీవు పాతాళ మునకు నరకములో ఒక మూలకు త్రోయ బడితివే..............." (యెషయా 14:12-15). ఇట్లు అపవాది తిరుగుబాటు చేయగా

అతని దూతలలో కొందరు పాతాళములో గల కటిక చీకటిగల బిలములలోనికి త్రోయబడిరి. తీర్పు దినము వచ్చు వరకు వారక్కడనే బంధింపబడి యుందురు. మరికొంత మంది దేవుని సేవలో నమ్మకముగా యున్న వారితో పోరాడుటకు తిరుగుచున్న వారివలె మనకు కనబడుచున్నారు (ప్రకటన 12:7-9; యూదా :9) అపవాదికిని అతని దూతలకును నిత్యాగ్ని గల నరకము సిద్ధము చేయబడినది. క్రీస్తు రెండవ రాకడలో వీరందరును దానిలోనికి పడద్రోయ బడుదురు. అపవాది దూతలేగాక మానవులలో క్రీస్తుకు అవిధేయులైన ప్రతి వారును నరకమునకు పాత్రులగుదురు.

"నమ్మి బాప్తిస్మము పొందువాడు రక్షింపబడును; నమ్మనొల్లనివానికి శిక్ష విధింపబడునని" క్రీస్తు చెప్పెను. నీవు అపవాదికి కలిగే శిక్షనుండి తప్పించుకొన గోరినయెడల ఈనాడే సువార్తకు లోబడుము.

- జాషువా గూటం

# మిర్యాము

(Miriam A Woman to Remember)

లేవీ వంశీయులైన అమ్రాము యాకెబెతుల ఏకైక పుత్రిక మిర్యాము. ఈమె సోదరులు అహరోను, మోషేలు. వీరి జీవిత కాలము ఇశ్రాయేలీయులు ఐగుప్తు దాసత్వమునుండి విమోచింపబడిన కాలము. ఇది బైబిలు చరిత్రలో చాల ప్రాముఖ్యమైన కాలముగ ఎంచదగును. మిర్యాము చిన్న నాటినుండియు దైవభక్తి, విధేయత, బాధ్యత, ధైర్యము కలిగిన సుగుణవతి.

ఐగుప్తు దేశమునకు బానిసగా అమ్మబడిన యోసేపును ఫరో తరువాత ఐగుప్తు దేశమునకు ఏలిక అగు ఉన్నత స్థాయికి దేవుడాశీర్వదించెను. కనానులో కలిగిన గొప్ప కరువు భారము నుండి తన స్వకీయులను తప్పించి, పోషించుట కొరకు యోసేపు తన జనాంగము నంతటిని ఐగుప్తు దేశమునకు రప్పించెను. దేవుడు వారి సంతానమును బహుగా విస్తరింపజేసి నందున యోసేపు మరణానంతరము యోసేపును ఎరుగని క్రొత్త ఫరో రాజు ఇశ్రాయేలీయులను ఎన్నో విధములుగ హింసించి వారిని హతమార్చదలచెను. కాని వారు శ్రమ పొందుచున్న కొలది విస్తరించుచుండగ ఫరో

రాజు హెబ్రీ స్త్రీలకు మగపిల్లలు పుట్టిన యెడల వారిని వెంటనే సంహరించుమనెడి ఆజ్ఞ ఐగుప్తు మంత్ర సానులకు జారీ చేయబడిన సమయములో మోషే పుట్టెను. తల్లి మూడు నెలలు దాచి యిక దాచలేక జమ్ముపెట్టెలో మోషేను పెట్టి నదిలో విడచి మిర్యామును తమ్మునికి కావలిగా యుంచెను. నదికి స్నానమునకు వచ్చిన ఫరో కుమార్తె ఆ బాలుని కనుగొనుట మిర్యాము చూచి ధైర్యముతో ఈ బిడ్డకు దాదిని తీసికొని వత్తువా? అని ప్రశ్నించి తన తల్లిని ఆ బిడ్డకొరకు దాదిగా తీసికొనిరాగా మోషేకు తన తల్లియొద్దనే పెరిగే అవకాశము కలిగెను. తల్లి ఉగ్గుపాలతో మోషేకు దేవుని గూర్చిన జ్ఞానమును కలిగించుట కవకాశము కలిగెను. ఈ విషయములో మిర్యాము పాత్ర చాల ఎన్నదగినది. కనుక మిర్యామును జ్ఞాపకము చేసికొనుట మంచిది (నిర్గమ 2:1-10).

**మిర్యాముకు నాయకురాలిగ యుండు లక్షణములు గలవు :**

1. ఫరో హెబ్రీయులలో పుట్టిన ప్రతి కుమారుని నదిలో పారవేయుడి, ప్రతి కుమార్తెను బ్రతుకనియ్యుడి అని తన జనులందరికి ఆజ్ఞ యిచ్చెను (నిర్గమ 1:22). ఇటువంటి కఠినమైన రాజాజ్ఞ యుండినపుడు 14 సం॥ల ప్రాయములలోనే మిర్యాము తన తమ్ముడైన మోషేను గూర్చిన బాధ్యతను తలిదండ్రులచేత స్వీకరించినది. ఆమె వహించిన పాత్రను గూర్చి మనము పైన తెలిసికొని యున్నాము.

2. బాల్యము నుండియు మిర్యాము నకు నమ్మకత్వము, బాధ్యత యుండుట వలన తమ చిన్నకుమారుని గూర్చిన బాధ్య తను తల్లిదండ్రులు మిర్యాముకు అప్పగించ గలిగిరి. మిర్యాము సమర్థతతో వాటిని నెరవేర్చెను.

3. తన తమ్ముని కొరకు దాదిని తీసికొని వచ్చుటలో ఆమె చురుకుదనము, శ్రద్ధ, ధైర్యము మెచ్చదగినవి (నిర్గమ 2:7-8).

ఇటువంటి నాయకత్వ లక్షణములు గలిగిన మిర్యాము వివాహము చేసికొన్నట్లు యెచ్చటను మనకు వ్రాయబడిలేదు. ఆమె తన సమయము, జీవితము నంతటిని దేవుని సేవ కొరకే ఉపయోగించెను. కనుక దేవుడైన యెహోవా ఆమెను ఇశ్రాయేలు జనాంగమునకు నాయకురాలిగా నియ మించెను. మిమ్మును నడిపించుటకు మోషే, అహరోను, మిర్యాములను పంపితిని (మీకా 6:4). పెండ్లికాని స్త్రీయు, కన్యకయు తాము

శరీర మందును, ఆత్మయందును పవిత్రు రాండ్రయి యుండుటకు ప్రభువు విషయ మైన కార్యములను గూర్చి చింతించుదురు (1 కొరింథీ 7:34). కనుక మిర్యాము యెల్లప్పుడు దేవుని కార్యములను గూర్చిన చింతనయే కలిగి యుండెడిది.

ఇశ్రాయేలీయులు ఎర్రసముద్ర మును దాటిన ఆశ్చర్యకరమైన సంఘటన తరువాత 6,00,000 మంది వారి కుటుంబ ములతో యుండిన ఈ పెద్ద సమూహ మునకు ముందుగా మిర్యాము తంబురను చేతపట్టుకొనెను. స్త్రీలందరు తంబురల తోను, నాట్యములతోను ఆమెను వెంబ డింప వెళ్ళగా మిర్యాము వారితో కలసి దేవుని స్తుతించుచు జయగీతమెత్తి పాడెను (నిర్గమ 15:22-27).

స్త్రీలు వివాహితులైనను, అవివాహితు లైనను దేవని సేవ చేయుటకు ఈ దినము లలో ఎన్నో విధములగు అవకాశములు గలవు. లూదియ యను దైవభక్తికలిగిన స్త్రీని గూర్చి కూడ మనము బైబిలు గ్రంథము నందు చూడగలము. ఈమె మంచి వ్యాపా రస్థు రాలు. అయినప్పటికిని ఆమెకు దేవుని సేవయందు గల ఆసక్తిని బట్టి ఫిలిప్పి పట్టణములో ఒక బలమైన సంఘము యేర్పడుటకు కారకురాలయ్యెను. ఆమె యింటి వారందరును పౌలు మున్నగు సేవకులైన వారికి ఆతిధ్యమిచ్చుటలోను, దేవుని సేవకొరకు వారిని ప్రోత్సహించు టలోను ఎంతో గణణకెక్కిన వారు. దేవుని సేవ కొరకు మిర్యాము, లూదియలవలె మంచి నిపుణత గలిగిన నాయకులు, నాయికరాండ్రుగ యుండుటకు అట్టి వారినిగ మనము తర్ఫీదు చేయవలెను.

**మిర్యాము చేసిన పాపము:** ఇశ్రాయేలీయులు అరణ్యములో తిరుగు చున్నపుడు మోషే కూషు దేశపు స్త్రీని వివాహము చేసికొననందున అహరోను, మిర్యాములు మోషేకు వ్యతిరేకముగ మాట్లాడినందున శిక్ష అనుభవింప వలసి వచ్చెను (సంఖ్యా 12:1-2). మిర్యాము దానికి సాకు చెప్పెను. కాని నిజమునకు ఆమె మోషే యొక్క నాయకత్వమునకు వ్యతిరేకముగ మాట్లాడింది. మోషేను దేవు డైన యెహోవా తన ప్రజలైన ఇశ్రాయేలీ యులకు నాయకత్వము వహించుమని చెప్పెను. కనుక మోషే నాయకత్వమును ధిక్కరించుట యెహోవా దేవుని ధిక్క రించుట యనియే మనము గ్రహించాలి. మిర్యాము యొక్క హృదయాంతరంగ మును దేవుడు గ్రహించెను. తిరుగుబాటు చేసిన వారికి మిర్యాము నాయకత్వము

వహించెను. కనుకనే శిక్షను మిర్యాము భరించెను (సంఖ్యా 12:8-10). ఈ తిరుగుబాటు తనము అసూయచేత కలిగినటు వంటిది. అయితే ఈ విషయములో మోషే పాపము చేసెనా? "కాని సూర్యుని క్రింద జరుగు సమస్త అన్యాయ క్రియలనుగురించి నేను యోచించితిని. బాధింపబడువారు ఆదరించు దిక్కులేక కన్నీళ్లు విడుచు చుందురు. వారిని బాధపెట్టువారు బలవంతులు గనుక ఆదిరించు వాడెవడును లేకపోయెను" (ప్రసంగి 4:1). ఈ పాపము మిర్యాము హృదయములోనే యున్నది. తన హృదయ స్థితిని బట్టి మోషేను నిందించుటకు ప్రారంభించెను. తన జీవితమంతా దైవ సేవతో గడిపిన మిర్యాము దేవుని దృష్టిలో ఘోరమైన తప్పిదమును చేసెను. శిక్షకు పాత్రురాలయ్యెను. సాత్వికమైన మనస్సు శరీరమునకు జీవము. మత్సరము ఎముకలకు కుళ్ళు. మత్సరముతో నిండి యుండి నందున మిర్యాము శిక్షపొందెను. కాని మోషే కాదు. మత్సరము సమస్తకీడుకు మూలము. బైబిలులో అసూయచేత నింపబడి అధోగతి పాలైన అనేక మందిని మనము చూడగలము. కయీను, యోసేపు అన్నదమ్ములు, రాహేలు, లేయా, సౌలు, యెజెబెలు, క్రీస్తును ద్వేషముతో సిలువకు అప్పగించిన మత నాయకులు ఎందరో గలరు.

దేవునిచే యేర్పాటు చేయబడిన నాయకుని మీద తిరుగుబాటు చేయుట దేవునిపై తిరుగుబాటు చేయుటయే. మోషేపై తిరుగుబాటు చేయుటను బట్టి యెహోవా అహరోను, మిర్యాములతో మాట్లాడెను (సంఖ్యా 12:8-10). దేవుడింత కఠినమైన శిక్షను మిర్యాముకు ఎందుకిచ్చెను? యెహోవాచే నియమింపబడిన నాయకుని ధిక్కరించుట దేవుని ధిక్కరించుటయే. అది పాపము. ఇశ్రాయేలీయులు ప్రవక్తయైన సమూయేలును నిరాకరించినపుడు యెహోవా సమూయేలుతో "వారు నిన్ను విసర్జింపలేదు గాని తమ్మును ఏలకుండ నన్నే విసర్జించి యున్నారు" (1సమూయేలు 8:7) అని చెప్పెను. ప్రతి అధికారము, ఆధిపత్యము దేవుని నుండియే కలిగెను. అధికారమును ఎదిరించుట దేవుని నెదిరించుటయే. పరిపాలనా క్రమము సక్రమముగ యుండునట్లును, శాంతి సమాధానములు స్థిరముగ యుండునట్లును ఈ అధికారములను దేవుడు ఆయారీతులుగ విభజించి యిచ్చెను (రోమా 13:1-5). సంఘ నాయకులైనటువంటి వారు స్థానిక సంఘములపై (హెబ్రీ 13:17).

భార్యలపై భర్తల అధికారము (1 పేతు 3:1). బిడ్డలపై తల్లిదండ్రులు (ఎఫెసీ 6:1-3) దాసులపై యజమానులు (ఎఫెసీ 6:5) మున్నగునవి. ఆధిపత్యమునకు యేర్పాటు చేయబడిన వారందరూ దేవుని నియమము చొప్పుననే చేయవలెను. కాని వారి స్వంత యిష్టప్రకారం మాత్రం కాదు. వారు స్వంత యిష్టప్రకారము చేయునపుడు మనము మానవుని నియమము కంటె దేవునికి లోబడుటయేశ్రేష్టము. మోషే దైవజనుడు గనుక తన అక్కయైన మిర్యాము స్వస్థత కొరకు హృదయ పూర్వకముగ దేవునిని బ్రతిమాలాడెను. మోషే యెలుగెత్తి దేవా దయచేసి ఈమెను బాగుచేయమని చెప్పెను (సంఖ్యా 12:13). మీరు పరలోక మందున్న మీతండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి (మత్త 5:44-46). మోషే యిట్టి గొప్ప మనసును కలిగియుండి నందున మిర్యాము కొరకు ప్రార్థన చేసెను.

ఏడు దినములైన తరువాత దేవుడు మిర్యామును స్వస్థపరచుటచే తిరిగి ఆమె పాళెములో ప్రవేశించెను. పాపము చేసి చెడిపోయిన తన బిడ్డలను స్వస్థపరచుటకు తండ్రియైన దేవుడు ఎంతో ఆశపడుచున్నాడు. రక్షింపబడుటకు ఆశించుటే గాక ఆయన తన దగ్గరకు రమ్మని బ్రతిమలాడుచున్నాడు. ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు (2 పేతు 3:9). భ్రష్టులైన బిడ్డలారా తిరిగి రండి; మీ అవిశ్వాసమును నేను బాగుచేసెదను (యిర్మియా 3:20-23). తప్పిపోయిన కుమారుని గూర్చిన కథను బట్టి తన బిడ్డలు తండ్రి యొద్దకు తిరిగి వచ్చినప్పుడు తండ్రికి కలిగెడి ఆనందము, పరలోకములో దూతల ఆనందము మనము గ్రహించగలము.

- లోటీ బెత్ హాట్స్

---


గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

# చక్కగా బోధించాలంటే ఎక్కువ చదవాలి

తన చిత్తాన్ని మానవ జాతికి బయలు పరచుటకు దేవుడు ప్రవక్తలను అపొస్తలులను వినియోగించెను. వారు మాట్లాడినప్పుడు, వ్రాసినప్పుడు పరిశుద్ధాత్మ వలన నడిపింపబడిరి (ఎఫెసీ 3:3-5; యోహాను 14:26; 16:13; 1కొరింథీ 2:13). పరిశుద్ధాత్ముడు వారిని సర్వ సత్యములోనికి నడిపించెను. అది లిఖించబడెను (యోహాను 16:13; 2 తిమోతి 3:16-17; గలతీ 1:8-9; ప్రకటన 22:18-19). వారు లిఖించిన దానిని చదువుట ద్వారా బోధకులతో సహా మిగతా వారందరు అదే వర్తమానము పొందుదురు (ఎఫెసీ 3:4-5). పరిశుద్ధులకు ఒక్క మారే అప్పగింపబడిన బోధకొరకు పోరాడవలెనని యూదా 1:3లో హెచ్చరింపబడినది. అందువలన బోధకులు ఒక్కమారే అప్పగింపబడిన బోధను జాగ్రత్తగా చదువవలెను.

యౌవన బోధకుడైన తిమోతిని పౌలు ఇట్లు హెచ్చరించెను : "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనబరుచుకొనుటకు జాగ్రత్త పడుము" (2 తిమో 2:15). దేవుని వాక్యమును సరిగ ఉపదేశించాలంటే బోధకుడు దానిని జాగ్రత్తగ చదవాలి. ఎవడైన దేవుని వాక్యాన్ని చదవ కుండా బోధించుటకు ప్రయత్నించ కూడదు. ఆత్మలను రక్షించు దేవుని వర్తమానము ప్రాముఖ్యమైనది గనుక బోధకుడు దానిని జాగ్రత్తగ చదివి, యితరుకు అర్ధమయేలాగున బోధించాలి.

దేవుని వాక్యాన్ని సరిగ ఉపదేశించాలంటే దిగువ సూత్రములు పాటించాలి. ఏదైనా అంశము ఎప్పుడు చెప్పబడింది? దాన్ని ఎవరు చెప్పారు? అది ఎవరికి చెప్పబడింది? అట్లే బైబిలు పఠనమునకు మిగతా సూత్రములు కూడ వర్తిస్తాయి. కొందరు బోధకులకు పాత క్రొత్త నిబంధనల వ్యత్యాసము తెలియదు. పాత నిబంధన ఇశ్రాయేలీయులకును, క్రొత్త నిబంధన మానవులందరికినీ వర్తించునని తెలిసికోవాలి (హెబ్రీ 7:12; 10:9-10). వారు యూదుల ఆరాధనను, క్రొత్త నిబంధన ఆరాధనను మిళితం చేస్తారు. కొన్ని సంగతులు ఎవరికి చెప్పబడెనో వారు గమనించరు. క్రైస్తవులకు వర్తించని సంగతులను క్రైస్తవులకు బోధిస్తారు. అలాగ కాకుండా సత్యవాక్యాన్ని సరిగ తెలిసికొని యితరులకు బోధించాలి. అప్పుడు వారు వాక్యానికి విధేయులవుతారు. సత్యము మానవులను స్వతంత్రులనుగా చేయును (యోహాను 8:32).

వినేవారికి సహాయకరముగా

యుండు బైబిలు వర్తమానములను సిద్ధపరచాలి.

కొంతమంది బోధకులు సహాయకరమైన ప్రసంగములను చేయుట మాని బైబిలు కథలనో లేక సొంత అనుభవాలనో బోధిస్తారు. బైబిలు కథలను చెప్పుట మంచిదే. ఆలాగే ఒక అంశాన్ని వివరించుటలో ఉదాహరణలు కూడ చెప్పుట మంచిదే. యేసుప్రభువు ఉపమాన రీతిగ బోధించారు. అయితే కాలయాపన చేయుటకు, ప్రజలకు వినోదము కలిగించుటకు మనము బోధించుట లేదని జ్ఞాపకముంచు కొనవలెను. దేవుని వర్తమానవమును మానవులకు అందించే దేవుని సేవకులు బోధకులు. గనుక ఆ వర్తమానాన్ని ప్రజలు నిద్రపోకుండా వినేలాగున ఆసక్తికరముగా యుండునట్లు బోధించాలి. ఒక బోధకుడు ప్రసంగము చేస్తూ నిద్రపోవుచున్న ఒకనిని చూచి అతని ప్రక్కను కూర్చొనిన వానికి అతన్ని లేపుమని చెప్పాడు. "అతన్ని నిద్రపుచ్చినది నీవే, గనుక నీవే లేపుమని" అతడు బోధకునికి జవాబిచ్చాడు! నీవు చెప్పేది ప్రజలు ఆసక్తికరముగా వినేలాగున సిద్ధపడవలెను.

బోధకులు తాము ఎవరికి వాక్యము నందించబోవుచున్నారో గమనించుకొని వారికి సహాయకరమైన వర్తమానమును సిద్ధపరచాలి. మనం వాక్యము బోధించువారికి దైనందిన సమస్యలుంటాయి. దేవుని వాక్యాన్ని బట్టి వారు ఆ సమస్యల నుండి బయట పడడానికి సహాయకరమైన వర్తమానమును అందించాలి.

కొందరికి మానవుని యెడల దేవునికున్న సంకల్పము వినిపించబడాలి. రక్షింపబడడానికి యేమి చేయాలో తెలియజేయబడాలి. మరి కొంతమందికి క్రీస్తు సంఘమును గూర్చి తెలియజేయబడాలి. దానికిని మతశాఖలకును వున్న తేడా బోధింపబడాలి. ఇంకా కొంతమందికి క్రైస్తవ జీవితాన్ని గూర్చి, ఆత్మ ఫలములను గూర్చి, కృపలో ఎదుగుటను గూర్చి బోధింపబడాలి. గనుక ఏయే సందర్భాలలో ఎట్టి ప్రజలతో దేవుని వాక్యాన్ని పంచుకొనుచున్నామో తెలిసికొని వారికి సహాయకరమైన ప్రసంగములను సిద్ధపరచుకోవాలి.

నీవు బోధించునప్పుడు సూక్ష్మంగా, క్లుప్తముగా, అర్థమయ్యేలాగున, ఆసక్తికరంగా బోధించాలి. నిన్ను వినుచున్న వారికి దేవుని సత్యాన్ని పంచి యిస్తున్నావనే సంగతిని మరువరాదు. అందరికీ వినబడే లాగున గొంతెత్తి మాట్లాడుము. ప్రజలకు అర్థము కాని పదజాలము వినియోగించవద్దు. అబద్ధ బోధను గూర్చి గాని, అవినీతి ప్రవర్తనను గూర్చి గాని బోధించునప్పుడు ప్రేమ గలిగి సత్యము చెప్పుచు సంపూర్ణ దీర్ఘశాంతముతో బోధించాలి (ఎఫెసీ 4:15;

2తిమో 4:2). దేవుని వాగ్దానాలు మానవులకు నిరీక్షణ, సంతోషము కలుగజేస్తాయి. మనము కూడా ఆలాగే బోధించాలి!

సత్యవాక్యమును సరిగా బోధించాలంటే బోధకుడు బైబిలు జ్ఞానం కలిగియుండాలి

మన కాలంలో పలు విధాలుగా మానవ కల్పిత సిద్ధాంతములు ప్రజలు మనస్సులలో నాటుకు పోయాయి. అందువలన వాటిని క్రీస్తు బోధతో మిళితం చేయకుండు టకు బైబిలును జాగ్రత్తగా చదవాలి. మానవ కల్పిత సిద్ధాంతములను బట్టి చేయు ఆరాధన వ్యర్థము (మత్తయి 15:7-9; 2యోహాను:9). బైబిలు బోధతో మన మనస్సును నింపుకొనిన యెడల మానవ కల్పిత సిద్ధాంతములకు తావుండదు.

క్రొత్త నిబంధనను చదువువారు క్రీస్తు ఒకే ఒక్క సంఘమును నిర్మించెనని గ్రహించెదరు (మత్తయి 16:18). అది డినామినేషన్లుగా విభజింపబడలేదు (యోహాను 17:20-21; 1 కొరింథీ 1:10-12). సంఘము ఆయన శరీరమని పిలువబడినది (ఎఫెసీ 1:22-23). అందరు యూదులేమి, అన్యజను లేమి ఆ శరీరములో దేవునితో సమాధాన పరచబడుదురు (ఎఫెసీ 2:16). ఆ సంఘమును దేవుడే ముందుగా సంకల్పించెను (ఎఫెసీ 3:10-11; 3:12). ఆ సంఘము ఒకే ఒక్కటి యున్నది (ఎఫెసీ 4:3-6). క్రీస్తు యొక్క సంఘము. దాని నామము లోను, ఆరాధన, నిర్మాణ పద్ధతిలోను ఎట్లున్నదో క్రొత్త నిబంధనను చదివి, యితరులకు బోధించాలి.

కొందరు మతశాఖల వారిని సంతోషపెట్టుటకు సత్యమును ప్రకటించుటలో రాజీపడ్డారు. పూర్వకాలపు ప్రవక్తల వలె వారు "సమాధానము లేని సమయమున-సమాధానము సమాధానమని చెప్పుదురు" (యిర్మియా 6:14). వారట్లన్నప్పుడు "పురాతన మార్గములను గూర్చి విచారించుడి, మేలుకలుగు మార్గమేది అని యడిగి అందులో నడుచుకొనుడి; అప్పుడు మీకు నెమ్మది కలుగును" అని చెప్పబడింది (యిర్మియా 6:16). గనుక అదిమ క్రైస్తవ్యము ఎట్లుండెనో తెలిసి కోవాలంటే శ్రద్ధాపూర్వకమైన బైబిలు పఠనము అవసరం. తరువాత దేవుడు చెప్పిన రీతిగనే దానిని బోధించుటకు ధైర్యం అవసరం. మనుష్యుల మెప్పుకంటే దేవుని మెప్పును కోరుకోవాలి. దేవుని వర్తమానము కలిగిన దైవజనుని వలె యుండుము.

నిజక్రైస్తవ్యమనగా సరియైన బోధ, సరియైన జీవనము! (1తిమో 4:16; కొలస్స 3:1-14; 2యోహాను: 9-11). తమ జీవితములను బట్టి దేవుడు మహిమ పరచబడేలాగున జీవించాలని సహోదరులకు మనం బోధించాలి. క్రీస్తు వర్తమానము

సంపూర్తిగ బోధిస్తు ప్రజలు దాన్ని అనుసరించేలాగున ప్రోత్సహించాలి. "మీయందున్న క్రీస్తు, మహిమ నిరీక్షణయై యున్నాడను సంగతిని తన పరిశుద్ధులకు తెలియపరచగోరి.............ప్రతి మనుష్యునికి బోధించుచు ఆయనను ప్రకటించు చున్నామని" పౌలు చెప్పెను (కొలస్స 1:27-28). మనమును అట్లు చేయాలి.

✍ - చార్లెస్ ఎఫ్. స్కాట్

# లోన కొద్దిపాటి తీపి (పంచదార)

ఒకతల్లి తన ఆరు సంవత్సరాల కుమార్తెను హత్తుకుంది. అమ్మా, "నిన్ను ఇంత తీపిగా చేసిందేమిటి"? అని ఆమె అడిగింది. దానికి ఆ చిన్న బాలిక ఇలా అంది. "బహుశః దేవుడు నన్ను చేసినపుడు లోపల కొంచెం పంచదార వేసాడనుకుంటాను". యేసు ప్రభువు యొక్క సలహా వినండి "ఇయ్యుడి, అప్పుడు మీకు ఇయ్యబడును, అణచి, కుదిలించి, దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడును" (లూకా 6:38).

మంచితనము గొప్ప లాభములను తెస్తుంది. సామెతలు 21:21లో ఆయన తలంపు ప్రతిధ్వనించింది. "నీతిని కృపను అనుసరించువాడు, జీవమును నీతిని, ఘనతను పొందును" (సామెతలు 21:21).

**కొన్ని గుణాలు**

మర్యాద : మర్యాద అనేది ప్రపంచ మంతటికి తెలిసినదే. పేతురు మొదటి పత్రిక మూడవ అధ్యాయంలో ఇలా అంటున్నాడు. "తుదకు మీరందరు ఏక మనస్కులై యొకరి సుఖదుఃఖముల యందు ఒకరు పాలుపడి సహోదర ప్రేమగలవారును, కరుణాచిత్తులును, వినయ మనస్కులునై యుండుడి" (1 పేతురు 3:8).

రూతు తన ప్రియమైన అత్త నయోమితో తాను ఎరుగని దేశానికి వచ్చింది. ఎండలో పొలం కోయువారి వెనుక పరిగెఏరుతూ పొలంలో పనిచేసింది. ఆమె మంచి మర్యాదలు, చిరునవ్వు బోయజు హృదయాన్ని గెలిచాయి (రూతు 2:11). చివరకు ఇద్దరు వివాహం చేసికొన్నారు. రూతు గనుక మంచిగా మర్యాదగా ప్రవర్తించి ఉండకపోతే ఈ సంతోషకరమైన కథ మరొక రకంగా మలుపు తిరిగి ఉండేది.

**నేర్పరితనం** :ఈ గుణం గలవారు కొన్ని సున్నితమైన స్థలాలలో వ్యతిరేకతను చవిచూస్తారు. సామెతలు 25:11లో జ్ఞాని ఇలా అంటున్నాడు, "సమయోచితముగా పలుకబడిన మాట చిత్రమైన వెండి పళ్లెములో నుంచబడిన బంగారు పండ్ల వంటిది". కొందరు సమయోచితమైనమాట సరియైన సమయంలో చెప్పేవరము కలిగి ఉన్నారు. బైబిలులోని పుటలను మనం వెతికిన యెడల ఎస్తేరు గొప్ప లాభం పొందుటకు నేర్పరితనంను ఉపయోగించింది. రాజుకొరకు ఒక విందుచేసి హామానును దానికి ఆహ్వానించింది. హామాను యూదులకు రూఢియైన శత్రువు. పర్షియాలో నివసిస్తున్న ప్రతి ఇశ్రాయేలీయుని చంపుటకు అతడు పథకం వేసాడు. రాణియైన ఎస్తేరు గొప్ప గుణ లక్షణాలను చూపుతూ తన కోరిక ఏమిటో రాజుకు తెలియచేయుటకు బహు తెలివిగా కనిపెట్టింది. గర్విష్టియైన హామానును మరొక విందుకు ఆహ్వానించింది. సరియైన సమయం ఆసన్నమైనపుడు నేరము చూపుతు............మా విరోధియగు ఆ పగవాడు దుష్టుడైన యీ హామానే" (ఎస్తేరు 7:6) అని అన్నది.

**ఓర్పు** : దేవుని ఓర్పును గురించి చూచుటకు అమాలేకీయులకు ఆయన చేసిన వాగ్దానం చూద్దాం. నిర్గమ కాండం 17:14లో "నేను అమాలేకీయులు పేరు ఆకాశము క్రింద నుండకుండ బొత్తిగా తుడిచి వేయుదును" (నిర్గమ 17:14).

వందసంవత్సరాలు, 200 వందల సంవత్సరాలు, 300 వందలు - ఇంకా అమాలేకీయులు వారి యుద్ధాలను జరుపుతూనే ఉన్నారు. వాగ్దానం నెరవేర్చుటకు పూర్వం నాలుగువందల మూడు సంవత్సరాలు గతించాయి. 1 సమూయేలు 15:2లో "సైన్యముల కధిపతియగు యెహోవా సెలవిచ్చునదేమనగా అమాలేకీయులు ఇశ్రాయేలీయులకు చేసినది నాకు జ్ఞాపకమే" అంటున్నారు. అపుడు వారి నందరిని సంపూర్తిగా నాశనం చేయమని సౌలు రాజుకు చెప్పారు.

యాకోబు క్రైస్తవులను "సహోదరులారా, ప్రభువు రాకడ వరకు ఓపిక కలిగియుండుడి" (యాకోబు 5:7) అంటున్నాడు. ఇంతకు పూర్వమునకు ఇలా చెప్పాడు. "మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించును" (యాకోబు 1:3).

బిడ్డలు మంచివారుగా కావాలి అంటే మనం వారితో ఓర్పుగా పని చేయాలని ఎరుగుదుము. సుందరమైన పుష్పాలు, శ్రావ్యమైన సంగీతంనకు కూడా ఓర్పు, సహనంతో కూడిన పని అవుసరం.

"లోపల కొద్దిపాటి పంచదార" అను అంశాన్ని మనకు పరిచయం చేసిన చిన్న బాలికవలె మనము కూడ చెప్పులాగున జీవించుదాం.

✍ - **బెట్టీ టకర్**

వాసుదేవరావు, సత్యనారాయణ గార్లు నిర్విరామకృషి చేసి సువార్త కూటమును జయప్రదము గావించిరి. ధవళేశ్వరంలోను, రాజమండ్రిలోను సోదరులు బీర లాజరస్ గారు పలు సంవత్సరముల నుండి సువార్త చాటుచున్నారు.

మార్చి 20వ తేదీ ఆదివారం సాయంత్రం వాడపర్రులో జరిగిన కూటములో జాషువా గారు, వారిసతీమణి కబితాగారు, కుమారుడు రాబిన్‌గారు హాజరైరి. వాడపర్రు, ఉప్పలగుప్తం, బడుగువారిపేట సంఘముల నుండి సోదరసోదరీలు ఆ కూటమునకు హాజరైరి. వచ్చిన వారందరికీ స్త్రీలకు ఒక దుప్పటి, చీర, పురుషులకు ఒక దుప్పటి చొప్పన జాషువా దంపతులు పంచిపెట్టిరి. పై మూడు గ్రామములలోను సోదరులు డి. రంగారావ్, ఎ.వెంకట్రావ్, పి.అర్జున రావ్ గార్లు సువార్త చాటుచున్నారు.

మార్చి 16వ తేదీ రాత్రి కోరుకొండలో ఏర్పాటు చేయబడిన సువార్త కూటములో సోదరులు జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. స్థానికులు అనేకులు హాజరై "యేసు క్రీస్తు ఎవరు?" అను అంశముపై గొప్ప సందేశమును వినిరి. కోరుకొండలో సోదరులు కె. కొర్నేలియస్ గారును, ఆయన కుమారుడు మోజెస్ గారును గొప్పపని చేయు చున్నారు.

మార్చి 18వ తేదీ సాయంత్రం రామేశ్వరం - అచ్చుతాపురంలో జరిగిన సువార్త కూటములో జాషువాగారు వాక్యపరిచర్య చేసారు. అక్కడ అంగర పొలు గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

మార్చి 24 నుండి 27 వరకు జాషువా దంపతులు, రాబిన్ గారు మద్రాసులో సత్యవాణి టి.వి. కార్యక్రమముల సందర్భముగా కొన్ని పనులను నిర్వహించి 27వ తేదీ ఉదయం ఆరాధన సమయానికి కాకినాడ క్షేమముగా చేరుకొనిరి.

మార్చి 30వ తేదీ బుధవారం ఉదయం రాజమండ్రి, నారాయణపురం క్రీస్తు సంఘ ప్రార్థన మందిర ప్రారంభోత్సవ కార్యక్రమము సోదరులు జాషువాగూటం గారు రిబ్బరు కత్తిరించుట ద్వారా ఘనముగా జరిగెను. తదుపరి జరిగిన కార్యక్రమమునకు సోదరులు

యస్. సమర్పణ సమూయేలు గారు అధ్యక్షత వహించగా టి.భాస్కరరావ్ గారు ప్రారంభ ప్రార్థన చేసిరి. ఎ.రాజేంద్రరావు, వై.సురేష్ బాబు గార్లు వాక్య పఠనం చేసిరి. జి.జాకోబ్ గారి ప్రార్థనాంతరం జాషువాగూటం గారు "సహోదరుల ఐక్యతను" గూర్చి చక్కటి వాక్యోపదేశము చేసిరి. సోదరులు ప్రకాశ్‌గారు శుభాకాంక్షలు తెలియజేయగా, యస్.జె.బెన్‌హర్ గారు వందన సమర్పణ చేసిరి. యు.పౌలుగారి ప్రార్థనతో ఆ నాటి కూడిక ముగిసెను. తదుపరి వచ్చిన వారందరికీ స్థానిక సంఘము మంచి విందునేర్పాటు చేసిరి. రాజమండ్రి నారాయణపురంలోను, పరిసరప్రాంతములలోను సోదరులు యస్.జె.బెన్‌హర్ గారు క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు.

**2005 ఏప్రియల్ 6వ తేదీ మొదలు ప్రతి బుధవారం ఉదయం 6:30 నుండి 7:00 గం॥ల వరకు విస్పాఛానల్ లో కూడ సత్యవాణి కార్యక్రమమును చూడండి.**

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.